
సాక్షి
నిజామాబాద్
శనివారం : 15 : మార్చి : 2025



వైభవంగా వసంతోత్సవం

హోలీ పౌర్ణమి సందర్భంగా ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రంలో వసంతోత్సవం కనులపండువగా సాగింది.

- 8లో ▸



గరిష్టం/కనిష్టం
39.0 /19.4

వాతావరణం

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నిజాంసాగర్‌నుంచి నీటి విడుదల

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు శుక్రవారం ఐదో విడత నీటి విడుదలను ప్రారంభించారు. ప్రాజెక్టు ఆయకట్టు కింద 1.25 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు నాలుగు విడతల్లో నీటిని అందించారు. ఐదో విడతలో రోజూ వెయ్యి క్యూసెక్కుల చొప్పున నీటిని అందించనున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి 1,396.92 అడుగుల (8.351 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టునుంచి నీటిని విడుదల చేస్తున్నందున ప్రధాన కాలువలోకి ఎవరూ వెళ్లవద్దని అధికారులు కోరారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని రైతులకు సూచించారు. ఆయకట్టు కింద సాగు చేసిన ప్రతి గుంటకు సాగు నీరు అందించి పంటలను గట్టెక్కిస్తామని అధికారులు పేర్కొన్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

నిజామాబాద్‌అర్బన్ : శనివారం నుంచి ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పాఠశాలలు కొనసాగుతాయన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం అందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలు జరిగే పాఠశాలల్లో మధ్యా హ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు కొనసాగుతాయని తెలిపారు.

గ్రూప్స్‌లో జిల్లావాసి సత్తా



నిజామాబాద్‌నాగారం: గ్రూప్స్ ఫలితాల్లో జిల్లాకు చెందిన ఆనంద్‌కుమార్ సత్తా చాటాడు. కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామానికి చెందిన ఆనంద్-కరుణల కుమారుడు ఆనంద్. 2012లో ఎంఫార్మసీ పూర్తిచేశారు. అనంతరం ఢిల్లీలోని ఓ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం సాధించాడు. కానీ ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఐదేళ్ల క్రితం ఉద్యోగం మానేసి జిల్లాకు తిరిగి వచ్చేశాడు. అప్పటినుంచి పోటీ పరీక్షలకు సన్నద్ధమవగా గ్రూప్స్ పరీక్షలు రాశాడు. గత సంవత్సరం విడుదలైన గ్రూప్-4లో ఉత్తమ మార్కులు రావడంతో వాణిజ్య పన్నులశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాడు. గ్రూప్ 1, 2, 3 పరీక్షలు రాయగా అందులోనూ ఉత్తమ మార్కులు సాధించాడు. గ్రూప్ 1లో 448 ర్యాంకు, గ్రూప్-2 ఫలితాల్లో 359 మార్కులతో 877 ర్యాంకు, బీసీ-సీ కేటగిరిలో రాష్ట్రస్థాయిలో-5వ ర్యాంకు సాధించాడు. శుక్రవారం విడుదలైన గ్రూప్-3 ఫలితాల్లో 281 మార్కులతో 506 ర్యాంకు సాధించారు. బీసీ- సీ కేటగిరిలో ప్రథమ ర్యాంకు సాధించాడు. ప్రభుత్వ ఉద్యోగం సాధించడం చాలా సంతోషంగా ఉంది. ఐదేళ్ల శ్రమించిన కష్టానికి ఫలితాలు వచ్చాయని ఆనంద్ కుమార్ చెప్పారు.

రంగ్ బర్సే



జిల్లా వ్యాప్తంగా ప్రజలు శుక్రవారం హోలీ సంబురాలు నిర్వహించారు. చిన్నా పెద్ద తేడా లేకుండా రంగుల జల్లుల్లో తడిసిముద్దయ్యారు. నగరంలోని ఉమామహేశ్వర భవన్‌లో నృత్యాలు చేస్తూ ఆనందోత్సాహాల మధ్య రంగులు చల్లుకున్నారు.

గుద్దుకున్నారు



బోధన్ మండలం హున్సాలో ఏళ్లనాటి సంప్రదాయం కొనసాగింది. హోలీ సందర్భంగా గ్రామంలో పిడిగుద్దులాట నిర్వహించారు. ఒకరిపై ఒకరు పిడిగుద్దుల వర్షం కురిపించారు.

కళ్లముందే మాయాజాలం

- వినియోగదారులను తెలివిగా మోసం చేస్తున్న పలువురు వ్యాపారులు
- తూనికలు, కొలతల్లో మోసాలు.. నాసిరకం వస్తువులు అంటగడుతున్న వైనం
- ఔషధాలు, ఆహార పదార్థాలు, ఎలక్ట్రిక్ వస్తువుల అమ్మకాల్లో ఇదే పరిస్థితి
- థియేటర్లలో తినుబండారాలకు అనేక రెట్ల వసూళ్లు
- నేడు అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినం
- ఇందూరులో 'సాక్షి' పరిశీలన



తూనికలు, కొలతలు, వస్తువుల నాణ్యతా ప్రమాణాలు, ఆహార కల్తీ తదితరాలకు సంబంధించి వినియోగదారుల హక్కుల పరిరక్షణకు అనేక చట్టాలు ఉన్నప్పటికీ ఫలితం ఉండడం లేదు. ప్రభుత్వాలు ఏమాత్రం పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో వ్యాపారులు, వస్తు తయారీదారులు యథేచ్ఛగా వినియోగదారులను మోసం చేస్తూనే ఉన్నారు. శనివారం అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినం నేపథ్యంలో జిల్లా కేంద్రంలో 'సాక్షి' బృందం వివిధ వ్యాపార సముదాయాల వద్ద పరిశీలన చేసింది.

సాక్షి విజిట్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో గ్రామీణ వినియోగదారులు 67 శాతం ఉన్నారు. ఇక్కడ తూనికలు, కొలతల శాఖ 2011 లీగల్ మెట్రాలజీ రూల్స్ అమలు చేసే విషయంలో పూర్తి నిర్లక్ష్యంగా ఉంటోంది. అసలు ఈ శాఖ పనిచేస్తున్న సంగతే ఎవరికీ తెలియని పరిస్థితి. ఇక అక్రమ నిర్మాణాల విషయంలో 1987 మున్సిపల్ కార్పొరేషన్ అపార్ట్‌మెంట్ చట్టం, 2012 భవన నిర్మాణ నిబంధనలు, 2019 వినియోగదారుల రక్షణ చట్టం అమలు కావడం లేదు. జిల్లా స్థాయిల్లో వినియోగదారుల కమిషన్లు వేయడం లేదు. దీంతో వినియోగదారులు మోసపోతూనే ఉన్నారు.

బంగారు తూకంలో..

బంగారు దుకాణాల్లో కొనుగోలుదార్లకు టీజీఎస్టీ, సీజీఎస్టీ బిల్లులు ఇవ్వడం లేదు. తూకంలో సరైన కొలతలు పాటించినప్పటికీ, బంగారం తూకం వేసే సమయంలో వ్యాపారులు తెలివిగా సీలింగ్ ఫ్యాన్‌ను ఎక్కువ స్పీడ్ పెట్టడం ద్వారా తూకంలో తేడాను గమనించడం జరిగింది. శుభకార్యాలకు ఎక్కువ మొత్తంలో బంగారం కొనుగోలు చేసేవారి వద్దకు తెలిసిన వ్యక్తులు వచ్చి మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ, బంగారు వ్యాపారుల నుంచి ఎల్ సీడీ టీవీలు, ఏసీలు, ఇతర ఖరీదైన గృహోపకరణాలను బహుమతిగా పొందుతున్నారు. ఈ మేరకు ఒప్పందం చేసుకుంటున్నారు.

హోటళ్లలో నీళ్ల బాటిల్ నుంచి దోపిడీ మొదలు..

జిల్లా కేంద్రంలో సుమారు 200 వరకు చిన్న, పెద్ద హోటళ్లు ఉన్నాయి. చాలావాటిలో బిల్లులు ఇవ్వడం లేదు. బడా హోటల్స్‌లో జీఎస్టీ పేరిట పిండేస్తున్నారు. వందలో ఒకరిద్దరికి కచ్చితమైన బిల్లులు ఇస్తున్నారు. నీరు ఉచితంగా ఇవ్వాల్సి ఉండగా, నీళ్ల బాటిళ్లకు జీఎస్టీతో ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ప్రభుత్వానికి మాత్రం జీఎస్టీ లెక్కలు చూపించని పరిస్థితి.

హద్దులేని సినిమా థియేటర్ల దోపిడీ..

నగరంలోని మల్టీప్లెక్స్‌లు, టాకీస్‌లలో పార్కింగ్ నుంచి నీళ్ల బాటిళ్లు, శీతల పానీయాలు, తినుబండారాలకు బయటితో పోలిస్తే అనేక రెట్లు ఎక్కువ ధర వసూలు చేస్తున్నారు. తినుబండారాల క్వాలిటీ, క్వాంటిటీ అంతా తీసికట్టే. ఈ దోపిడీపై అనేక మంది నిలదీసినప్పటికీ మార్పు రావడం లేదు.


చిన్నపిల్లల కోసం ఇంటి నుంచి తీసుకొచ్చిన పాలకు సైతం అనుమతించని పరిస్థితి.

రసీదులు లేకుండానే ఔషధాలు..



నిజామాబాద్‌లో సుమారు 1,100 మెడికల్ షాపులున్నాయి. 99 శాతం దుకాణాల్లో బిల్లులు ఇవ్వడం లేదు. వినియోగదారులు బిల్లులు అడిగితే తెల్ల కాగితంపై రాసిస్తున్నారు. జీఎస్టీ బిల్లులు మాత్రం ఇవ్వడం లేదు.

పవర్ పెట్రోల్ పేరిట దోపిడీ..



పెట్రోల్ బంకుల్లో బిల్లులు ఇవ్వడం లేదు. ఎవరైనా గట్టిగా అడిగితే తెల్ల కాగితంపై రాసిస్తున్నారు. జీఎస్టీ బిల్లులో ఉండదు. ఇక మైలేజ్ ఎక్కువగా వస్తోందని పవర్ పెట్రోల్ పేరిట లీటరుకు రూ.116 వసూలు చేస్తున్నారు. సాధారణ పెట్రోల్ ధర మాత్రం రూ.112 ఉంది.వాహనాల టైర్లలో గాలి నింపే వర్కర్లు ఉండడం లేదు.

మాల్స్‌లో క్యారీబ్యాగుల పేరిట..



నగరంలో చాలా షాపింగ్ మాల్స్, సూపర్ మార్కెట్లలో క్యారీ బ్యాగులకు రూ.3 నుంచి రూ.30 వరకు వసూలు చేస్తున్నారు. మరోవైపు ఎలక్ట్రికల్ వస్తువులైన బల్బులు, ట్యూబ్ లైట్లకు బిల్లులు ఇవ్వడం లేదు. వినియోగదారులు కొన్న వస్తువులపై మార్కర్‌తో రాస్తున్నారు. వ్యాపారులు ప్రభుత్వానికి జీఎస్టీ ఎగ్గొడుతున్నారు.

సిండికేట్ దందా..



నగరంలో పూల వ్యాపారులు సిండికేట్‌గా వ్యవహరిస్తున్నారు. పండుగలు, పూజల సమయంలో మహారాష్ట్ర నుంచి పూలు తెస్తారు. హోల్‌సేల్‌గా విక్రయించే వర్తకులు కిలోకు 100 గ్రాములు గండికొడుతున్నారు. 50 కిలోలకు 2 కిలోలు తక్కువగా తూకం వేస్తున్నారు. కూరగాయల వ్యాపారులు సైతం ఇదేవిధంగా వ్యవహరిస్తున్నారు. కొందరు తక్కువ బరువు తూచే సాధారణరాళ్లను ఉపయోగిస్తున్నారు. డిజిటల్ తూకం యంత్రాల్లోనూ కిలోకు 100 గ్రాముల మేర తక్కువ వచ్చేలా సెట్ చేసుకుంటున్నారు. మాంసం విక్రయాల్లో మాయ చేస్తున్నారు. మాంసం కోసిన తర్వాత నీళ్లలో నానబెడుతున్నారు.

బిల్లులు ఇవ్వరు..



ఎలక్ట్రికల్ షాపులో ఏ వస్తువు కొనుగోలు చేసినా బిల్లులు ఇవ్వడం లేదు. ఎంఆర్‌పీ రేట్లను బట్టి అమ్మకాలు చేస్తున్నారు. దీంతో గ్యారంటీ వస్తువులు చెడిపోయినప్పుడు ఇబ్బందులు పడ్డాల్సి వస్తుంది. అధికారులు దృష్టి సారించి వినియోగదారులకు న్యాయం చేయాలి. **– బలేరావు వేణుగోపాల్, ముబారక్ నగర్**

ఆహార భద్రత కమిటీలు వేయాలి

హక్కుల పరిరక్షణకు వినియోగదారులు సంఘటితం కావాలి. బహిరంగ మార్కెట్‌లో ఉప్పు ప్యాకెట్లు, వంట నూనెల ప్యాకెట్లు నాసిరకం ప్లాస్టిక్‌తో తయారు చేసినవి ఉంటున్నాయి. ప్రతి వినియోగ వస్తువు 90 శాతం వరకు ప్లాస్టిక్ కవర్లతో ప్యాకింగ్ జరుగుతోంది. దీంతో ఆరోగ్యరీత్యా, పర్యావరణ పరంగా తీవ్ర నష్టాలకు కారణమవుతోంది. వస్తు వినియోగం నాణ్యతను ధ్రువీకరించే 'బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్', ఆహార పదార్థాల్లో ప్లాస్టిక్‌ను నియంత్రించే ఆహార కల్తీ నిరోధక శాఖ, స్థానిక స్వపరిపాలన సంస్థలు క్రియాశీలకంగా వ్యవహరించాలి. వినియోగదారుల రక్షణ చట్టం 2019 ప్రకారం జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆహార సలహా సంఘాలు, వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమిటీలు, ఆహార భద్రత కమిటీల ఏర్పాటు జరగాలి. హక్కుల అమలుకు ప్రభుత్వ యంత్రాంగాలు చిత్తశుద్ధితో వ్యవహరించినపుడే సుస్థిరమైన జీవనశైలికి మార్గం వేసినట్లు. **– సాంబరాజు చక్రపాణి, వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి**

కస్టడీలోని యువకుడి మృతితో కలకలం

- పోలీసులు కొట్టడంతోనే మృతి చెందాడని కుటుంబీకుల ఆందోళన
- జీజీహెచ్ ఎదుట ధర్నా
- ఫస్ట్‌క్లాస్ జడ్జి సమక్షంలో పోస్టుమార్టం
- కార్డియాక్ అరెస్ట్‌తో మృతి చెందినట్లు ప్రకటించిన సీపీ సాయి చైతన్య



పోస్టుమార్టం గది వద్ద రోదిస్తున్న మృతుని కుటుంబసభ్యులు



అలకుంట సంపత్ (ఫైల్)

ఖలీల్‌వాడి : సైబర్ క్రైమ్ పోలీసుల కస్టడీలో ఉన్న యువకుడు మృతి చెందిన ఘటన జిల్లాలో కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా అంతర్గాంలోని వడ్డెర కాలనీకి చెందిన అలకుంట సంపత్ (31) జగిత్యాల జిల్లాలోని శ్రీరామ ఇంటర్నేషనల్ మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీ మేనేజర్‌గా పని చేస్తున్నారు. సంపత్‌తోపాటు జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రంగపేటకు చెందిన చిరంజీవి, ఇబ్రహీంపట్నం మండలం ఎర్రాపూర్‌కు చెందిన మిట్టపల్లి నర్సారెడ్డిలు పనిచేస్తున్నారు. విదేశాల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురు నిరుద్యోగులు ఒక్కొక్కరి వద్ద రూ.లక్ష వసూలు చేశారు. కొంతమందిని లావోస్ దేశానికి డేటాఎంట్రీ ఆపరేటర్ల పేరిట పంపించారు. తీరా అక్కడ సైబర్ నేరాలు చేయించడంతో బాధితులు అక్కడి భారత రాయబార కార్యాలయంలో ఫిర్యాదు చేసి స్వదేశానికి తిరిగొచ్చారు. అనంతరం అలకుంట సంపత్, చిరంజీవి, నర్సారెడ్డిలపై జిల్లా కేంద్రంలోని సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ నెల 4న ముగ్గురిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. 12న కోర్టు అనుమతితో ముగ్గురు నిందితులను సైబర్ క్రైమ్ పోలీసులు కస్టడీలోకి తీసుకొని విచారణ నిమిత్తం జగిత్యాల జిల్లాకు తీసుకెళ్లారు. విచారణ అనంతరం జిల్లా కేంద్రంలోని సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకురాగా, గురువారం రాత్రి సంపత్ ఎడమ చేయి లాగుతోందని పోలీస్ సిబ్బందికి చెప్పడంతో వెంటనే జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న సమయంలోనే ఫిట్స్ రావడంతో మృతి చెందినట్లు పోలీసులు చెబుతున్నారు. సంపత్ మృతి విషయాన్ని గురువారం అర్ధరాత్రి 12.30 గంటలకు తమకు చెప్పినట్లు కుటుంబీకులు తెలిపారు.

ఫస్ట్‌క్లాస్ జడ్జి సమక్షంలో..

సంపత్ మృతదేహానికి ఫస్ట్‌క్లాస్ జడ్జి హరికృష్ణ సమక్షంలో ముగ్గురు వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం రిపోర్టును సీపీ సాయిచైతన్యకు అందించారు. సంపత్ మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

గుండె సమస్యతో మృతి చెందాడు

'అలకుంట సంపత్ గుండె సంబంధిత సమస్యతోనే మృతి చెందాడు. సంపత్ శ్రీరామ ఇంటర్నేషనల్ మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ ద్వారా నిరుద్యోగ యువతను థాయిలాండ్, మయన్మార్, లావోస్ తదితర ప్రాంతాలకు పంపించేవాడు. మోసపోయిన వారి ఫిర్యాదు మేరకు అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. పోలీసులు గురువారం జగిత్యాలలోని సంపత్ కార్యాలయానికి తీసుకెళ్లి అక్కడ విచారణ చేశారు. అదే రోజు రాత్రి ఎడమ చేయి, ఛాతీలో నొప్పి వస్తుందని చెప్పడంతో పోలీసులు జీజీహెచ్‌కు తీసుకువెళ్లారు. జీజీహెచ్‌లోని సీసీటీవీ ఫుటేజీలో సంపత్ నడుచుకుంటూ వెళ్లినట్లు గుర్తించాం. జీజీహెచ్‌కు వెళ్లిన తర్వాత సంపత్ కుప్పకూలిపోయాడు. వైద్యులు సీపీఆర్ చేసినా ఫలితం లేకుండా పోయింది. సంపత్ మృతిపై ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు అయ్యింది. విచారణ కొనసాగుతోంది.' అని సీపీ సాయి చైతన్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సమగ్ర విచారణ జరపాలి

సంపత్ మృతి విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం జీజీహెచ్‌కు చేరుకున్నారు. పోలీసులు తీవ్రంగా కొట్టడంతోనే తన భర్త సంపత్ మృతి చెందాడని భార్య ఆరోపించారు. మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని జీజీహెచ్ ఎదుట ఉన్న రోడ్డుపై ధర్నా చేశారు. న్యాయం చేస్తామని, జడ్జి సమక్షంలో వీడియో రికార్డింగ్ ద్వారా పోస్టుమార్టం చేయించి, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి హామీ ఇవ్వడంతో కుటుంబ సభ్యులు ధర్నా విరమించారు.

ప్రైమరీల్లో ఏఐ బోధన



కోనాపూర్ ప్రాథమిక పాఠశాలలో సిద్ధంగా ఉన్న కంప్యూటర్లు

- నేటి నుంచి 44 పాఠశాలల్లో శ్రీకారం
- ప్రాథమిక స్థాయిలోనే డిజిటల్ నైపుణ్యం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

కమ్మర్‌పల్లి: ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) కృత్రిమ మేధ బోధనను ప్రవేశపెడుతోంది. విద్యార్థుల పఠనా సామర్థ్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ కోర్సును ప్రాథమిక స్థాయి నుంచే ప్రారంభించేందుకు జిల్లాలో 44 పాఠశాలలను ప్రయోగాత్మకంగా ఎంపిక చేసింది. ఈ నెల 15 నుంచి కృత్రిమ మేధ ద్వారా బోధన ప్రారంభం కానుంది. ఈ మేరకు డీఈవో ఇప్పటికే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీచేశారు.

సర్వం సిద్ధం..

కృత్రిమ మేధతో విద్యా బోధన కోసం విద్యాశాఖ అధికారులు జిల్లాలో 44 ప్రాథమిక పాఠశాలలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. 1 నుంచి 5వ తరగతి వరకు సుమారు 3 వేల మంది విద్యార్థులు ఉన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) విద్యనందించేందుకు ఒక్కో పాఠశాలలో 5 కంప్యూటర్లు, హెడ్‌ఫోన్స్, ఇంటర్నెట్ సదుపాయంతో పాటు అవసరమైన ఎలక్ట్రానిక్ పరికరాలను అందుబాటులో ఉంచారు.

విద్యార్థుల స్థాయి మేరకు బోధన..

3, 4, 5వ తరగతుల విద్యార్థులు ఆశించిన స్థాయిలో అభ్యసనా సామర్థ్యాలు సాధించడానికి, గణితంలో చతుర్విధ ప్రక్రియలు సులభంగా నేర్చుకోవడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుంది. చిన్నారులను ఆకట్టుకునేలా రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో బోధిస్తారు. ఎంపిక చేసిన 3, 4, 5 తరగతుల విద్యార్థులు ఐదుగురిని ఒక బ్యాచ్‌గా ఏర్పాటు చేసి, ఒక్కో బ్యాచ్‌కు తెలుగు వాచకం, గణిత అభ్యాసాలపై 20 నిమిషాల వ్యవధిలో ఏఐ పాఠాలను బోధించనున్నామని విద్యాధికారులు తెలిపారు. విద్యార్థి అర్థం చేసుకుంటున్నాడా లేదా అని ఏఐ గుర్తించి.. అర్థం కాకపోతే సరళమైన మార్గంలో, అర్థం అయ్యిందంటే మరికొంత మెరుగైన పద్ధతిలో పాఠాలు బోధిస్తారు.

ప్రయోజనాలివే..

- విద్యార్థుల వ్యక్తిగత అభ్యాసన శైలిని మెరుగుపరచడంలో సహాయపడనుంది.
- విద్యార్థులకు తక్కువ సమయంలో ఎక్కువ నేర్చుకునే అవకాశం లభిస్తుంది.
- విద్యార్థుల బలహీనతలను గుర్తించి, వారి సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు టీచర్లు ప్రత్యేక శిక్షణ అందిస్తారు.
- ఏఐ టెక్నాలజీ సహాయంతో విద్యార్థులు నేర్చుకునే విధానాన్ని టీచర్లు విశ్లేషించి, వారికి తగిన మార్గదర్శకత ఇస్తారు.

విద్యా ప్రగతికి దోహదపడుతుంది

ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం, కృత్రిమ మేధ ద్వారా తరగతులు నిర్వహించడంతో విద్యార్థుల అభ్యసనంలో ప్రగతికి దోహదపడుతుంది. విద్యార్థుల హాజరు శాతం కూడా పెరిగే అవకాశం ఉంటుంది. 2025-26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరిక పెరిగే ఆస్కారం ఉంటుంది. **– అశోక్, డీఈవో, నిజామాబాద్.**

నూత్‌పల్లి పాఠశాలలో..

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలంలోని నూత్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో నేటి నుంచి కృత్రిమ మేధ(ఏఐ) ద్వారా బోధన అందించనున్నారు. అందుకోసం పక్కనే ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలలో కంప్యూటర్లను సిద్ధం చేశారు. 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ఏఐ ద్వారా బోధన శనివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎంఈవో రామకృష్ణ తెలిపారు. త్వరలోనే కంప్యూటర్ సౌకర్యాలున్న మిగతా పాఠశాలల్లో కూడా ఏఐ విద్యను అందుబాటులోకి తెస్తామన్నారు.

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ల సీజ్‌

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఆరేపల్లి, బండ రామేశ్వరపల్లి గ్రామాల్లోని వాగుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శుక్రవారం సీజ్‌ చేసినట్లు మాచారెడ్డి ఎస్సై అనిల్‌ తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వ్యక్తుల గురించి తెలిస్తే డయల్‌ 100కు సమాచారాన్ని అందించాలని కోరారు.

బెల్టు షాపుపై పోలీసుల దాడులు

- 49 లీటర్ల మద్యం స్వాధీనం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్‌ పరిధిలోని టేక్రియాల్‌ గ్రామంలో నిర్వహిస్తున్న ఓ బెల్టు దుకాణంపై శుక్రవారం రాత్రి దేవునిపల్లి పోలీసులు దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో 49 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బెల్టు షాప్‌ నిర్వహిస్తున్న కమ్మల మహేష్‌ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. దేవునిపల్లి ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మాచారెడ్డి మండలంలో..

మాచారెడ్డి: మండలంలోని ఎల్లంపేటలో అక్రమంగా నిర్వహిస్తున్న ఇద్దరి బెల్టు షాపులపై శుక్రవారం దాడి చేసి రూ.9వేల విలువైన మద్యాన్ని సీజ్‌ చేసినట్లు ఎస్సై అనిల్‌ తెలిపారు. అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

డొంకేశ్వర్‌లో గొర్రెల మృత్యువాత

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): డొంకేశ్వర్‌లో మేకల సురేశ్‌కు చెందిన గొర్రెలు వరుసగా మృతి చెందుతున్నాయి. వారం వ్యవధిలోనే పదిహేను గొర్రెలు చనిపోయినట్లు బాధితుడు తెలిపాడు. పశువైద్య అధికారి రాసిచ్చిన మందులు పని చేయడం లేదని, సరైన వైద్యం అందించడం లేదని ఆరోపించారు. పోస్టుమార్టం నిర్వహించగా కడుపులో నట్టల కారణంగా లివర్‌ ఇన్ఫెక్షన్‌ ఎక్కువై గొర్రెలు మరణిస్తున్నట్లు పశువైద్య అధికారి శ్రీకాంత్‌ వివరణ ఇచ్చారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఖలీల్‌వాడి: ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. నాలుగోటౌన్‌ ఎస్సై శ్రీకాంత్‌ తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని బోర్గాం (పి)కి చెందిన చిలుక రాజు(29) పారిశుధ్య కార్మికుడిగా పని చేసేవాడు. కొన్ని రోజుల క్రితం తనకు పెళ్లి చేయాలని తల్లిదండ్రులను కోరగా ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత చేస్తామని చెప్పగా వారితో గొడవ పడ్డాడు. అనంతరం పురుగుల మందు తాగి, ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా అతడు చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

ఖలీల్‌వాడి: నగరంలోని వినాయక్‌ నగర్‌కి చెందిన కోట్ల అనంత్‌ ఆలియాస్‌ చాకలి అనంత్‌ (52) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్‌ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. నిర్మల్‌ జిల్లా ముథోల్‌ మండలం ఎడిబిడి గ్రామానికి అనంత్‌ నాలుగేళ్లుగా కుటుంబంతో కలిసి నిజామాబాద్‌లో ఉంటూ, వాచ్‌మన్‌గా పనిచేసేవాడు. ఈనెల 6న భార్య ఊరికి వెళ్లగా, అదేరోజు సాయంత్రం అతడికి ప్రమాదవశాత్తు సిలెండర్‌ వద్ద మంటలు అంటుకున్నాయి. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై దాడి: రూ.4లక్షలు చోరీ

మోపాల్‌: మండలంలోని మంచిప్ప శివారులో ఓ వ్యక్తిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేసి రూ.4 లక్షలు చోరీ చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. డిచ్‌పల్లి మండలం నడిమితండాకు చెందిన నరేష్‌ డబ్బులు చెల్లించేందుకు చద్మల్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో మంచిప్ప శివారులో గుర్తు తెలియని వ్యక్తులు అతడిపై దాడి చేసి డబ్బులు చోరీ చేశారు. ఈ విషయమై నరేష్‌ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

SERVICES

CHANGE OF NAME

DODDANNAGARI GANGDHAR S/o. DODDANNAGARI NARSAIAH R/o. H.No. 1-1/2 Bussapur (V), Balkonda (M), Nzb (D). Have Changed my Name as DODDANNAGARI GANGA REDDY S/o. DODDANNAGARI NARSAIAH. [SCA25002166]

WANTED

Universal కంపెనీకి వర్క్‌ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25,000 నుండి 30,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్‌ వాట్సాప్‌ చేయండి. సెల్‌ : 95504 67459. [SCA 25002107]

త్రివేణి హోంకేర్‌ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుటకు వర్కర్స్‌ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్‌. జీ: 18K. Ph: 9640400073, 9160900024. [SCA25002140]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్‌
CONTACT: 9492010949

4 లైన్ల క్లాసిఫైడ్‌ ప్రకటన 200/- రూ॥లు
ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి తదుపరి ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.







నగరంలోని ఉమామహేశ్వరభవన్‌లో హోలీ సంబురాలు జరుపుకుంటున్న యువతులు.. గోశాలలో భజనలు చేస్తూ పువ్వులు చల్లుకుంటున్న యువకులు

అట్టహాసంగా హోలీ వేడుకలు

జిల్లాకేంద్రంలో శుక్రవారం హోలీ పండుగను ప్రజలు అట్టహాసంగా నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నా, పెద్దా తేడా లేకుండా ఒకరినొకరూ రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు. అలాగే పలుచోట్ల యువత, వివిధ సంఘాల సభ్యులు నృత్యాలు, కోలాటం, భజనలు చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, నిజామాబాద్‌



బీజేపీ కార్యాలయం వద్ద బ్యాండ్‌ కొడుతున్న అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ



రంగులు స్ప్రే చేస్తున్న మహిళలు



నృత్యం చేస్తున్న యువతులు



రంగులు స్ప్రే చేస్తున్న చిన్నారులు



నీళ్లు చల్లుతున్న యువతులు





నృత్యం చేస్తున్న యువకులు, మహిళలు



శ్రద్ధానందగంజ్‌లో కర్రలతో కోలాటం ఆడుతూ నృత్యాలు చేస్తున్న యువకులు

ఇందూరు తిరుమలలో వైభవంగా వసంతోత్సవం

మోపాల్‌: హోలీ పౌర్ణమి సందర్భంగా ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రం నర్సింగపల్లిలో శుక్రవారం వసంతోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ గోశాలలో జన్మించిన దూడకు రంగులు పూసి వసంతోత్సవాన్ని మొదలుపెట్టారు. అలాగే అర్చకులు ఒకరినొకరు రంగులు చల్లుకున్నారు.

ఉత్తర తిరుపతిలో..

నిజామాబాద్‌ రూరల్‌: నగరంలోని గంగాస్థాన్‌ ఫేజ్‌–2లోగల ఉత్తర తిరుపతిలో శుక్రవారం హోలీ పౌర్ణమి సందర్భంగా వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు రంగులు చల్లుకుంటూ హోలీ ఆడారు.



ఇందూరు తిరుమలలో స్వామివారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



హోలీ ఆడుతున్న అర్చకులు



ఉత్తర తిరుపతి క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు



హోలీ ఆడుతున్న భక్తులు

హున్సాలో పిడిగుద్దులాట



పిడిగుద్దులాటలో పాల్గొన్న హున్సా గ్రామస్తులు



కుస్తీపోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

బోధన్‌: వందేళ్ల క్రితం నాటి నుంచి హోలీ సందర్భంగా హున్సా గ్రామంలో నిర్వహిస్తున్న పిడిగుద్దులాట ఆఖరికి ఆనవాయితీ ప్రకారం కొనసాగింది. పోలీసులు ఆంక్షలు విధించిన నేపథ్యంలో ఆట కొనసాగింపుపై సందిగ్ధత నెలకొనగా, ఆఖరుకు ప్రజాప్రతినిధులు, కుల సంఘాల పెద్దలు పోలీసులను ఒప్పించారు. దీంతో సాలూర మండలంలోని హున్సా గ్రామంలో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రజలు రంగులు చల్లుకుంటూ హోలీ జరుపుకున్నారు. సాయంత్రం గ్రామ శివారులో కుస్తీ పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని హనుమాన్‌ ఆలయం వద్ద గ్రామస్తులు పిడిగుద్దులాటకు సిద్ధమయ్యారు. గ్రామ పెద్దలు కర్ర స్తంభాలు పాతి, బలమైన తాడును బిగించారు. తాడుకు ఇరువైపులా గ్రామస్తులు ఉండగా గ్రామ పెద్దల సూచన మేరకు ఆట మొదలు పెట్టారు. కుడి చేతితో తాడును పట్టుకుని ఎడమ చేతి పిడికిలితో ఒకొరినొకరు కొట్టుకున్నారు. పదినిమిషాల అనంతరం గ్రామపెద్దలు తాడును వదిలివేయడం ఆట ముగిసింది. అనంతరం ఇరువైపుల వారు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రూరల్‌ సీఐ విజయబాబు, ఎస్సై మచ్చేందర్‌ రెడ్డి పోలీసు బందోబస్తును పర్యవేక్షించారు.

క్రైం కార్నర్‌

పండుగ పూట విషాదం

- ఆటోను ఢీకొన్న లారీ
- ఆటో డ్రైవర్‌, ప్రయాణికురాలు మృతి
- పలువురికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి గురైన ఆటో

కామారెడ్డి క్రైం: సదాశివనగర్‌ మండలం కుప్రియాల్‌ గ్రామంలో పండుగ పూట విషాదం నెలకొంది. రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తోపాటు ఓ ప్రయాణికురాలు మృతిచెందడంతో గ్రామస్తులు తీవ్ర విషాదానికి గురయ్యారు. వివరాలు ఇలా.. సదాశివనగర్‌ మండలం కుప్రియాల్‌ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్‌ అంకం నరేందర్‌ (65) శుక్రవారం కామారెడ్డిలో ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకొని కుప్రియాల్‌కు బయలుదేరాడు. టేక్రియాల్‌ వద్దగల జాతీయ రహదారిపై వీరి ఆటోను తమిళనాడుకు చెందిన లారీ వెనుకనుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఆటో పల్టీలు కొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న సమీప గ్రామాలకు చెందిన లక్ష్మణ్‌, నింబాయిగారి లక్ష్మి, సమీనా, పకీర అబ్దుల్‌, ఎస్‌కే ఉస్మాన్‌లతో పాటు సదాశివనగర్‌ మండలం కుప్రియాల్‌ గ్రామానికి చెందిన కుమ్మరి నర్సవ్వ (70), ఆటో డ్రైవర్‌ అంకం నరేందర్‌ (65)లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే స్థానికులు, పోలీసులు కామారెడ్డి ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రికి తరలించారు. కొద్దిసేపటికే ఆటో డ్రైవర్‌ నరేందర్‌ మృతి చెందాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో నర్సవ్వను నిజామాబాద్‌ జనరల్‌ ఆస్పత్రికి రిఫర్‌ చేశారు. నర్సవ్వ అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ప్రమాదంలో ఒకే రోజు ఇద్దరు గ్రామస్తులు మృతి చెందటంతో కుప్రియాల్‌లో విషాదఛాయలు అలముకున్నాయి.

అదృశ్యమైన వ్యక్తి శవమై తేలాడు



పెద్ద భోజన్న (ఫైల్‌)

మాక్లూర్‌: మండలానికి చెందిన ఓ వ్యక్తి ఈనెల 13న అదృశ్యమవగా, శుక్రవారం వాగులో శవమై తేలాడు. మాక్లూర్‌ ఎస్సై రాజశేఖర్‌ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని గుంజ్లి గ్రామానికి చెందిన గోపు పెద్ద భోజన్న (55) గురువారం ఉదయం పొలానికి వెళ్లగా, రాత్రయినా తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంతవెతికినా అతడి ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరుసటి రోజు ఉదయం స్థానిక వ్యవసాయ బోరుబావి వద్దగల వాగులో శవమై తేలాడు. వెంటనే స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతుడు చేపలు పట్టడానికి వాగులోకి దిగాడా? లేక వ్యవసాయ మోటార్‌కు రిపేర్‌ చేయడానికి వాగులో దిగి, ప్రమాదవశాత్తు మృతి చెందాడా అనేది తెలియాల్సి ఉందన్నారు. ఈమేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాజశేఖర్‌ తెలిపారు.

ఇసుక డంపులు సీజ్‌

నందిపేట్‌(ఆర్మూర్‌): మండలంలోని తల్వేద గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక కుప్పలను స్థానిక పోలీసులు శుక్రవారం సీజ్‌ చేశారు. అంతకుముందు తల్వేద గ్రామ శివారులోని వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. అనంతరం గ్రామంలో నిల్వ ఉంచిన సుమారు 20 ట్రిప్పుల ఇసుక డంపులను రెవెన్యూ అధికారుల సమక్షంలో సీజ్‌ చేశారు. ట్రాక్టర్‌ డ్రైవర్‌ సురేష్‌తోపాటు ట్రాక్టర్‌ యజమాని సంటోళ్ల సాయరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

అదుపుతప్పి బ్రిడ్జి కిందకు దూసుకెళ్లిన కారు



భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలో జాతీయ రహదారి వద్ద ఉన్న టోల్‌గేట్‌ను తప్పించుకునేందుకు దారిని మార్చుకుని వెళ్తున్న కారు అదుపుతప్పి బ్రిడ్జి కిందికి దూసుకెళ్లింది. వివరాలు ఇలా.. హైదరాబాద్‌కు చెందిన ఒక కుటుంబం కారులో బాసరకు బయలుదేరారు. భిక్కనూరు వద్ద టోల్‌ తప్పించుకునేందుకు జాతీయ రహదారిని వదిలి భిక్కనూరు వచ్చి అంతంపల్లి మీదుగా వెళ్లారు. ఈక్రమంలో కారు అదుపుతప్పి బ్రిడ్జి కిందికి వెళ్లింది. సమీపంలో ఎవరూ లేకపోవడంతో వారు డయల్‌ 100కు సమాచారం అందించారు. వెంటనే భిక్కనూరు పోలీసులు, ఫైర్‌ ఇంజిన్‌ సిబ్బంది అక్కడికి చేరుకుని కారును పైకి తీసుకవచ్చారు. టోల్‌ తప్పించుకునేందుకు ఇలా అడ్డదారిలో వెళ్లడంపై అధికారులు వారిని మందలించారు. అనంతరం సదరు కుటుంబం అదే కారులో బాసరకు వెళ్లారు.

కుటుంబ విషయాల్లో అడ్డొస్తుందని తల్లి హత్య

- భర్తతో కలిసి ఘాతుకానికి పాల్పడ్డ కూతురు
- పోలీసుల అదుపులో నిందితులు
- వివరాలు వెల్లడించిన నార్త్‌ సీఐ శ్రీనివాస్‌



వివరాలు వెల్లడిస్తున్న నార్త్‌ సీఐ శ్రీనివాస్‌

ఖలీల్‌వాడి: కన్న తల్లిని కట్టుకున్న భర్తతో కడతేర్చింది ఓ కూతురు. ఈ ఘటనలో దంపతులిద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని నార్త్‌ సీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐ శ్రీనివాస్‌ వివరాలు వెల్లడించారు. నాగారం 300క్వార్టర్స్‌లో రమేష్‌, సౌందర్య అనే దంపతులు నివసిస్తున్నారు. సౌందర్య తల్లి విజయలక్ష్మి నాలుగు సంవత్సరాలుగా వీరివద్దనే ఉంటోంది. ఈక్రమంలో విజయలక్ష్మి తరుచూ ఇంటి విషయాల్లో జోక్యం చేసుకోవడంతో కూతురు, అల్లుడికి ఇబ్బందిగా మారింది. దీంతో ఆమె అడ్డు తొలగించుకోవాలని భావించి బుధవారం రాత్రి విజయలక్ష్మి పడుకోగానే దంపతులు ఇద్దరు కలిసి ఆమె ముఖంపై దిండుపెట్టి ఊపిరి ఆడకుండా చేసి, చేతితో గొంతు పిసికి చంపారు. సహజ మరణంగా నమ్మించడానికి యత్నించగా, అనుమానం వచ్చి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విచారణలో వారు నేరం అంగీకరించడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై గంగాధర్‌, సిబ్బంది ఉన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇళ్లు దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది



వివరాలు సేకరిస్తున్న అధికారులు

రుద్రూర్‌: మండలంలోని అంబం (ఆర్‌) గ్రామంలో శుక్రవారం షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించి రెండు నివాసపు గృహాలు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన లక్ష్మి, సావిత్రిలు తమ ఇళ్లల్లో ఒంటరిగానే ఉంటున్నారు. హోలీ సందర్భంగా వారు బయటకు వెళ్లిన సమయంలో ఆయా ఇళ్లల్లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. స్థానికులు గమనించి బోధన్‌ ఫైర్‌ స్టేషన్‌ సిబ్బందికి సమాచారం అందించగా, వారు గ్రామానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే ఇంట్లోని బంగారం, వెండి ఆభరణాలు, డబ్బులు కాలిపోయాయని బాధితులు తెలిపారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ భారతి, తహసీల్‌ కార్యాలయ జూనియర్‌ అసిస్టెంట్‌ భూషన్‌ ఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఒక్కొక్కరి ఇంటిలో సుమారు రూ. లక్షా 50వేలు ఆస్తి నష్టం జరిగినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. బాధితులకు ప్రభుత్వం సహాయాన్ని అందించాలని గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు అధికారులను కోరారు.